

**ప్రత్యేక పూజలు**

శ్రీకాళహస్తి పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - 8లో



**కీచక టీచర్ అరెస్ట్**

వెంకటగిరిలో కీచక టీచర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. - 8లో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| తిరుపతి | 34 | 24 |
| చిత్తూరు | 34 | 24 |
| తిరుమల | 31 | 21 |
| గూడూరు | 37 | 28 |
| నగరి | 36 | 26 |

## న్యూస్‌రీల్

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 66,977 మంది స్వామివారిని దర్శించుకోగా.. 33.020 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.39 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### 12, 13 తేదీల్లో జిల్లాకు కేంద్ర మంత్రి

**తిరుపతి అర్బన్:** కేంద్ర రహదారులశాఖా మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 12,13 తేదీల్లో జిల్లాకు రానున్నారని, ఆమేరకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. జేసీ డీకే బాలాజీతో కలిసి ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 12వ తేదీన రేణిగుంట–శ్రీకాళహస్తి జాతీయ రహదారి–71 మార్గంలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా చెట్టు నాటే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 13వ తేదీన తిరుపతి నగరంలోని తారకరామ స్టేడియంలో కృష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2, 3, 4కు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించనున్నట్టు వివరించారు.

### క్యాన్సర్ సర్వేలో స్పష్టత ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**తిరుపతి అర్బన్:** క్యాన్సర్ సర్వేలో స్పష్టత ఉండాలని, తప్పులు లేకుండా కచ్చితమైన సమాచారంతో నివేదిక తయారు చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం జిల్లా కాన్సర్ కమిటీ సభ్యులైన డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాల గుర్తింపుపై 691 సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంల తోపాటు ఎంఎల్‌హెచ్‌పీల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న కాన్సర్ స్క్రీనింగ్ విధానం పగడ్బందీగా అమలు చేయాలని, ఈ విధానంలో 30 ఏళ్ల పైబడిన మహిళలకు మొదటి ప్రాధాన్యతగా చికిత్సలు అందించాలని సూచించారు. సర్వేలో క్యాన్సర్ లక్షణాలు ఉంటే పింక్ బస్సుకు అనుసంధానం అవుతుందని, పింక్ బస్ పర్యటన సందర్భంగా వైద్య పరీక్షలు, చికిత్స ప్రారంభమవుతుందని వివరించారు. సీవియర్ కేసులు ఉంటే వెంటనే ఆస్పత్రికి పంపే విధంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పింక్ బస్ పర్యటన షెడ్యుల్‌పై సచివాలయ వలంటీర్లకు రెండుమూడు రోజుల ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, స్విమ్స్ ప్రతినిధి డాక్టర్ జయచంద్రారెడ్డి, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, డాక్టర్ భారతి, టాటా క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనారు.

### ప్రజాసేవకు పడవెక్కి..!




ఇరకం దీవికి పడవలో బయలుదేరిన అధికారులు

**తడ:** ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం చూశాం.. చెప్పులరుగుతున్నా కనికరించని అధికారులను చూశాం.. కానీ ప్రజలను వెతుక్కుంటూ అధికారులు వెళ్లడం చూశామా..?.. ఇలాంటి పరిస్థితులను కలలోనైనా ఊహించామా..? ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రజలను వెతుక్కుంటూ వెళ్లడం కనిపిస్తోంది. ఇలాంటిదే శుక్రవారం తడ మండలంలో చోటుచేసుకుంది. ఇరకం దీవి, గ్రద్దగుంట సచివాలయాల్లో శుక్రవారం సురక్ష కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ కే జయజయరావు ఆధ్వర్యంలోని అధికారుల బృందం బీవీపాళెం పడవ రేవు నుంచి పడవలో ఇరకం వెళ్లి అక్కడి సమస్యలు పరిష్కరించి, అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. అదేవిధంగా గ్రద్దగుంటలో ఎంపీడీఓ ఆమోసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనేక మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ కే రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కే వెంకటేష్, సర్పంచ్ కాటయ్య, తడకండ్రిగ ఉప సర్పంచ్ అఫ్రిది పాల్గొన్నారు.

---

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకొచ్చి దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించారు.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన ఒక అడుగు ముందుకేస్తే.. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేశారు. పగటిపూటే తొమ్మిదిగంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. కాడికట్టి మేడిపట్టిన అన్నదాతకు ఏ కష్టం రాకుండా వినూత్న పథకాలతో మన్ననలందుకుంటున్నారు. విత్తు నుంచి విక్రయం వరకు అన్నీ తానై వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వైఎస్సార్ జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించి సరికొత్త పథకాలతో ముందుకు సాగుతున్నారు.

# రైతు ఇంట.. ఆనందం పంట



- నేడు రైతు దినోత్సవం
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కల సాకారం
- జిల్లాకు ఉచిత పంటల బీమా కింద రూ.70.82 లక్షలు
- లబ్ధిపొందనున్న 2,193 మంది రైతులు
- ప్రారంభానికి సిద్ధమైన వ్యవసాయ ప్రయోగశాలలు



సూళ్లూరుపేటలో ప్రారంభానికి సిద్ధంగా ల్యాబ్



సత్యవేడులో వ్యవసాయ ల్యాబ్

**తిరుపతి అర్బన్:** 'అష్టకష్టాలకోర్చి గుప్పెడు గింజలు పండించి.. పిడికెడు మెతుకులు పెడుతున్న అన్నదాతకు వెన్నుదన్నుగా నిలవాలి. పుడమినే నమ్ముకున్న రైతన్నకు అండగా నిలవాలి' అన్న ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా విలువైన సూచనలు, సలహాలు అందించి అధిక దిగుబడికి దోహదపడుతోంది. ఇప్పుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని రైతు దినోత్సవంగా నిర్వహిస్తూ సరికొత్త పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గత ఖరీఫ్‌లో పంట దిగుబడి తగ్గిన రైతులకు ఉచిత పంటల బీమా పథకం కింద పరిహారం చెల్లించేందుకు సిద్ధమైంది. వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా, కల్యాణదుర్గం నుంచి ప్రారంభించనుండగా.. అదే సందర్భంలో తిరుపతి జిల్లా స్థాయి కార్యక్రమాన్ని సత్యవేడులో నిర్వహించనున్నారు.

**ఉచితం..రైతుకు ఊతం!**

రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. రైతులపై భారం పడకుండా ప్రభుత్వమే బీమా ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తోంది. 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2,193 మంది రైతులకు, రూ.70.82 లక్షలు చెల్లించనుంది. ఈ బీమా వెదర్ బేసిడ్ స్కీమ్(ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం) ద్వారా వరి, సజ్జ పంటలకు పరిహారం చెల్లిస్తున్నారు. మరోవైపు వీల్డ్ బేసిక్ స్కీమ్(దిగుబడి తగ్గితే) ఈ పథకం వర్తిస్తుంది. వేరుశనగ పంటకు కూడా ఇది వర్తిస్తుంది.

**ఉచితంగా ప్రయోగశాలలు**

రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. వాటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే సత్యవేడు ల్యాబ్‌కు రూ.105.91 లక్షలు, సూళ్లూరుపేట ల్యాబ్‌కు రూ.116.5 లక్షలు హెచ్చించారు. ఈ ల్యాబ్‌ల్లో విత్తనాల మొలక శాతం, తేమ శాతం స్వచ్ఛత ప్రమాణాలను పరీక్షించి రైతులకు తెలియజేయనున్నారు. ఇప్పటికే ఇవి శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, చంద్రగిరి కొనసాగుతుండగా.. 1,312 విత్తన నమూనాలు, 958 ఎరువుల నమూనాలు పరీక్షలు నిర్వహించారు.

**ప్రారంభానికి సిద్ధం**

మరోవైపు సత్యవేడు, సూళ్లూరుపేటలో సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. రైతు దినోత్సవం సందర్భంగా శనివారం అధికారులు వీటిని ప్రారంభించనున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి, వెంకటగిరిలో ఈ ప్రయోగశాలలు నడుస్తున్నాయి.

**సద్వినియోగం చేసుకోండి**



రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. మీ మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ ఆఫీసర్లను సంప్రదిస్తే పథకాల వివరాలు తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంట బీమా ద్వారా రూ.70.82 లక్షలు చెల్లిస్తుంది. తాజాగా హార్టికల్చర్ ద్వారా 380 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయ్యాయి.

-కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్

**నేడు రైతులకు ఉచిత పంట బీమా**

-జిల్లా వ్యాప్తంగా 2,193 మందికి లబ్ధి

| మండలం | రైతులు | పంట బీమా (రూ.లలో) |
|---|---|---|
| శ్రీకాళహస్తి | 400 | 17,87,620 |
| ఏర్పేడు | 112 | 2,72,965 |
| కేవీబీపురం | 27 | 99,404 |
| తిరుపతి రూరల్ | 12 | 5,851 |
| చిన్నగొట్టిగల్లు | 923 | 34,15,169 |
| పాకాల | 719 | 15,01,228 |
| మొత్తం | 2,193 | 70,82,237 |

**తిరుపతి అర్బన్:** 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద జిల్లా వ్యాప్తంగా 2,193 మంది రైతులకు రూ.70.82 లక్షల సొమ్ము జమకానుంది. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని సత్యవేడులో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

**అర్హులందరికీ పంట బీమా**



అర్హులైన రైతులందరికీ పంట బీమా వర్తించేలా చర్యలు చేపట్టాం. రైతులు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలి. అప్పుడు పూర్తి సమాచారం తెలుస్తోంది.

-ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

## బాబు గుండెల్లో దడ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి మంగళం :** ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి చంద్రబాబు గుండెల్లో దడ పుడుతోందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి 30వ డివిజన్ నెహ్రూనగర్‌లో శుక్రవారం కార్పొరేటర్ కల్పనయాదవ్, అధ్యక్షుడు ఎస్‌కే.ఇమ్రాన్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న నాలుగేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి చంద్రబాబు నిద్రలేని రాత్రులెన్నో గడుపుతున్నాడన్నారని తెలిపారు. జగనన్నపై బురదజల్లాలని విషప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. ఓటమి భయంతో ముందస్తు ఎన్నికలంటూ ఎల్లో మీడియాలో ద్వారా విషప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలంతా జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన పార్టీలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమన్నారు. గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, కార్పొరేటర్లు తిరుత్తణి శైలజ, తిరుపతి మునిరామిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఇమామ్, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, నైనారు శ్రీనివాసులు, పార్టీ నాయకులు యాదవకృష్ణ, షర్మిల, పసుపులేటి రవి, రవీంద్రనాథ్‌రెడ్డి, కన్నయ్య, శ్రీనివాసులు ప్రసన్న, విశ్వేశ్వరయ్య, బండి మణి, లోకేష్, తాలూరి ప్రసాద్, కంకణాల రమేష్, నాదముని తదితరులు పాల్గొన్నారు.

---



▸▸ చిత్తూరు గిరింపేటలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను పూర్తిగా పక్కనపెట్టేశారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసేందుకు నిబంధనలకు వ్యతిరేకంగా స్టేట్ సిలబస్ స్థానంలో వివిధ కోర్సులను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని పాఠశాలలపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

▸▸ తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, మెటీరియల్ పేర్లతో వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. ఎన్సీఈఆర్టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలను కాకుండా సొంతంగా తయారు చేసుకున్న సిలబస్‌తో ఉన్న బుక్స్‌నే విద్యార్థులకు విక్రయిస్తున్నారు. తాము ముద్రించిన పుస్తకాలనే.. తాము నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నతంగా చదువుకునేందుకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోంది. అందులో భాగంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడేలా సిలబస్‌ను రూపొందించింది. తక్కువ ధరకే పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. అయితే సర్కారు లక్ష్యాలను ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నీరుగార్చేస్తున్నాయి. నిబంధనలను బేఖాతర్ చేస్తూ మెటీరియల్ పేరుతో సొంతంగా సిద్ధం చేసిన బుక్స్‌ను పిల్లలకు అంటగడుతున్నాయి. ఇందుకోసం తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నాయి.

# పుస్తకాల పేరుతో.. 'ప్రైవేట్' దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా సొంత సిలబస్
- ప్రభుత్వం ఆదేశాలు బేఖాతర్
- ఇండెంట్ నమోదు చేయని కార్పొరేట్ స్కూళ్లు
- మెటీరియల్ బుక్స్ పేరిట దర్జాగా మోసం
- తల్లిదండ్రుల ముక్కు పిండి భారీ మొత్తంలో వసూళ్లు



ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు

**ఉమ్మడి జిల్లా సమాచారం**

| | |
|---|---|
| చిత్తూరు జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు 500 | ఇండెంట్ నమోదు చేసినవవి 64 |
| తిరుపతి జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు 709 | ఇండెంట్ నమోదు చేసినవవి 162 |

**చిత్తూరు కలెక్టరేట్ :** సమాజంలోని అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. సర్కారు బడులతో పాటు ప్రైవేట్ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు సైతం సహకరిస్తోంది. అన్ని పాఠశాలల్లోని పిల్లలకు అమ్మఒడి పథకం కింద నగదు అందజేస్తోంది. అయితే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల వారు విద్యను అంగట్లో వస్తువుగానే పరిగణిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైతే చాలు దోపిడీకి దుకాణం తెరిచేస్తున్నారు. పిల్లల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పుస్తకాల పేరుతో వేల రూపాయలు దోచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ కాసులు మూటగట్టుకుంటున్నారు.


**సొంత పుస్తకాల అమ్మకం!**

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ బ్రాండ్‌ల పేర్లతో సొంత పుస్తకాలను ముద్రించుకుంటున్నాయి. ఇది నిబంధనలకు వ్యతిరేకమైనా పట్టించుకోవడం లేదు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్సీఈఆర్టీ) రూపొందించిన పాఠ్యపుస్తకాలతోనే బోధన సాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్సీఈఆర్టీ పుస్తకాలను ప్రైవేట్ పాఠశాలలకు సరఫరా చేసేందుకు విద్యార్థుల వివరాల ఇండెంట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఇదివరకే విద్యాశాఖాధికారులు ఆదేశించారు. అయితే వాటిని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు బేఖాతర్ చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కొనుగోలుకు నిరాసక్తత చూపుతున్నాయి.

**దోచుకునేందుకే..!**

విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పాఠ్యపుస్తకాలను నిర్ణీత ధరకే విక్రయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఒకటో తరగతికి రూ.399, 2 వ తరగతికి రూ.425, 3వ తరగతికి రూ.675, 4వ తరగతికి రూ.702, 5వ తరగతికి రూ.727, 6వ తరగతికి రూ.747, 8వ తరగతికి రూ.1181, 9వ తరగతికి రూ.1167, 10వ తరగతికి రూ.859గా పుస్తకాల ధరలను నిర్ణయించింది. దుకాణాల్లో సైతం అదే ధరలకు పుస్తకాలను విక్రయించాలని స్పష్టంగా పేర్కొంది. అయితే ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల వారు వేరే కంపెనీల పుస్తకాలను అధిక ధరలకు విక్రయించి తల్లిదండ్రులను దోచుకుంటున్నారని విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. రూ.3వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తూ సొంత సిలబస్‌తో కూడిన బుక్స్ అంటగడుతున్నారని మండిపడుతున్నారు.

**గుర్తింపు రద్దు చేయాలి**



విద్యాసంస్థలన సేవా దృక్పథంతో నిర్వహించాలి. అయితే ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా విద్యా వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్సీఈఆర్టీ పుస్తకాలనే పిల్లలకు అందజేయాలి. అయితే సొంత సిలబస్‌తో రూపొందించిన బుక్స్ ఇస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని. వాటి గుర్తింపును రద్దు చేయాలి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**కఠిన చర్యలు తప్పవు**



ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్‌నే అమలు చేయాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ నిబంధనలను ఎవరైనా కచ్చితంగా పాటించాల్సిందే. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులు వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓ కార్యాలయాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చు. పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే సహించే ప్రసక్తే లేదు.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

---

# తెల్ల'దొరలు'!

- తెల్లరాయిని కొల్లగొడుతున్న టీడీపీ దొంగలు
- విచ్చలవిడిగా తవ్వకాలు,అక్రమ రవాణా



తరలించేందుకు సిద్ధంగా తెల్లరాయి

**సాక్షి, తిరుపతి:** తెల్లరాయి దోపిడీలో టీడీపీ దొంగలు ఆరితేరిపోయారు. పెద్ద మనుషుల ముసుగులో ఉన్న టీడీపీ నేతలు.. తెరచాటున అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ కోట్ల రూపాయలు దోచుకుంటున్నారు. నెల్లూరు.. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ.. ఫోన్ల ద్వారా అక్రమ తవ్వకాలు చేపట్టి దర్జాగా తెల్లబంగారాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఎవ్వరూ నోరెత్తకుండా ఉండేలా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అక్రమ తవ్వకాలు.. రవాణా కారణంగా పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గూడూరు డివిజన్ సైదాపురం, చెమిర్తి, కాంద్ర, కందలి, కడివేడు పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న తెల్లరాయి నిక్షేపాలను టీడీపీ నేతలు విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి అక్రమ తవ్వకాలు, రవాణాలో ఆరితేరిన నాయకులు.. పాత పరిచయాలతో రెచ్చిపోతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

తెల్లరాయి కోసం అడవిని కొల్లగొడుతున్న టీడీపీ దొంగలు.. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. లారీలో అయితే 9 టన్నులు, టిప్పర్‌లో 18 టన్నులకు అనుమతి. అయితే రెండింతలు రాయిని లోడ్ చేసుకుని అక్రమంగా తరలిస్తున్నారు. ఫలితంగా టన్నుకు చెల్లించాల్సిన రూ.100 రాయిల్టీకి ఎగనామం పెడుతున్నారు. ఇలా రోజూ సుమారు వందకుపైగా లారీ, టిప్పర్ల ద్వారా తెల్లరాయిని తరలిస్తున్నారు. అంటే రోజుకు సుమారు రూ.లక్ష, నెలకు రూ.30 లక్షల చొప్పున ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

**అసైన్డ్ భూముల్లో లీజు**

లీజు ఓ చోట.. తవ్వకాలు ఓ చోట చేస్తున్న అక్రమార్కులు.. తెల్లరాయిని నిల్వచేసుకునేందుకు యార్డులు ఏర్పాటు చేసుకున్నారు. పట్టా భూమిలోనే యార్డులు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి. అయితే టీడీపీ నేతలు అధికారంలో ఉన్న సమయంలో అసైన్డ్‌మెంట్ భూముల్లో అనుమతులు తీసుకుని ఉన్నారు. అనుమతులు ఉన్న యార్డుల్లో కార్మికులకు ఎక్కడా భద్రతా ఏర్పాట్లు చేసిన దాఖలాలు లేవు. కార్మికుల వివరాలు నమోదు చేసే బీ రిజిస్టర్ ఊసే లేదు. ఈ పరిస్థితుల్లో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినా.. ఎవ్వరూ నోరెత్తేందుకు వీల్లేకుండా అక్రమార్కులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే.. కొందరు రాయి లేని చోట ఓ మైనింగ్‌ని సృష్టించి.. అందులో నుంచి రాయిని తరలించేందుకు పర్మిట్లు తీసుకుంటున్నారు. అయితే లీజు అనుమతి లేని చోట ఉన్న రాయిని అదే పర్మిట్లతో తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

**ఇష్టారాజ్యంగా అనుమతులు**

లీజు మంజూరు చేయాలంటే.. మైనింగ్, అటవీ, రెవిన్యూ శాఖ అధికారులు జాయింట్ సర్వే చేయాల్సి ఉంది. అయితే ఈ శాఖలో కొందరు అధికారుల సహకారంతో సర్వే లేకనే అనుమతులు పొందుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆ అనుమతులు కూడా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకుండానే మంజూరు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అక్రమ త్వకాలు జరుగుతున్న విషయం స్థానికులకు తెలిసినా నోరెత్తడానికి సాహసించలేకపోతున్నారు. అక్రమ తవ్వకాలు జరిగే ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో అధికారులు, స్థానికులు సైతం లోనికి వెళ్లేందుకు సాహసించలేకపోతుండడం గమనార్హం.

## అవతారోత్సవం..నేత్రపర్వం



హారతి అందుకుంటున్న స్వామివారు

**తిరుచానూరు(చంద్రగిరి):** తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కొలువైన సుందరరాజస్వామి వార్షిక అవతారోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా జ్యేష్ఠ మాసం, ఉత్తరాభాద్ర నక్షత్రం రోజున ముగిసేలా అవతారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి వారి శ్రీకృష్ణ స్వామి ముఖమండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. విశేష అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి స్వామి వారు పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. శ్రీసుందరరాజస్వామి అవతారోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం అభిషేకం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి హనుమంత వాహన సేవ జరగనుంది.

## క్లుప్తంగా

### 22న రోషన్ సినిమా ప్రకటిస్తాం


ఆలయం వెలుపల శ్రీకాంత్, కుటుంబ సభ్యులు

**తిరుమల:** కుమారుడు రోషన్ సినిమాను ఈనెల 22వ తేదీన ప్రకటించనున్నట్టు తన తండ్రి, సినీ హీరో శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారిని ప్రతి ఏడాదీ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈనెల 22వ తేదీన రోషన్ సినిమాను ప్రకటిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్లో దేవర, రామ్‌చరణ్, శంకర్ కాంబినేషన్లో గేమ్ చేంజర్, బోయపాటి, రామ్ ప్రాజెక్ట్ స్కంధ మూవీలో తాను ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నట్టు శ్రీకాంత్ వెల్లడించారు.

### క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతి జిల్లాలో అర్హత కలిగిన అన్ని వయో విభాగాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడా రెఫరీలు, కోచ్‌లు, క్రీడాకారులు తమ పేర్లను తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో నమోదు చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు కాని వారు జిల్లా సంఘం తరఫున పోటీల్లో పాల్గొనేందుకు వీలుండదని తెలిపారు. త్వరలో అండర్–14, 17 బాలబాలికల జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలవారు 99639 98853, 99660 54692లో సంప్రదించాలని సూచించారు.

### విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి

**ఏర్పేడు:** మండలంలోని జంగాలపల్లిలో గురువారం ఒక ఇంటిలో ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన ప్రతాప్(65) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. మండలంలోని జంగాలపల్లికి చెందిన మంగయ్య ఇంట్లో గురువారం ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలిందన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ పరీక్షించి ప్రతాప్ మృతి చెందినట్లు ధ్రువీకరించారని వెల్లడించారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## నాయీబ్రాహ్మణులు వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన నాయీబ్రాహ్మణులతో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి మంగళం:** తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రి సమీపంలోని షాదీమహల్ వద్ద శుక్రవారం తిరుమల కళ్యాణకట్టలో పనిచేస్తున్న వంద మంది నాయీబ్రాహ్మణులు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తిరుమల కళ్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు జెస్టిన్ అజయ్‌రాజ్ మాట్లాడుతూ అతిచిన్న వయసులోనే ప్రజాసంక్షేమం, తిరుపతి నగర అభివృద్ధి కోసం భూమన అభినయ్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజాసంక్షేమం, నగర అభివృద్ధికి రాత్రింబవళ్లు శ్రమిస్తుండడం భూమన కుటుంబానికే సాధ్యమన్నారు. తిరుపతి నగరంలో ఎన్నడూ, ఎవ్వరూ ఊహించని విధంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మాణం చేపట్టి తిరుపతిని మహానగరంగా తీర్చిదిద్దిన ఘనత భూమన అభినయ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాంటి కుటుంబానికి అండగా ఉండి, వారితో కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యున్నతి కోసం పనిచేయాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్టు తెలిపారు.

## ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌పై పట్టు అవసరం


మాట్లాడుతున్న ఎస్వీయూ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ ప్రొఫెసర్ డీఎం.మురళి

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఉద్యోగాల కోసం ప్రయత్నించే విద్యార్థులు ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ భాష, సాంకేతిక విషయాలపై పట్టు సాధించాలని ఎస్వీయూ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డీఎం.మురళి తెలిపారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కౌటిల్య విద్యాసంస్థ ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ గురువారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తార్కిక ఆలోచనలతోనే కార్పొరేట్ కొలువులు సాధ్యమన్నారు. విద్యార్థులు ఆ దిశగా ముందుకు సాగుతూ సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అలాగే మంచి వ్యక్తిత్వాన్ని పొందేందుకు మంచి రచయితల పుస్తకాలు చదవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాల నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు.

## 11న ఐటీఐ కళాశాలల్లో ఉద్యోగ మేళా

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఉప ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణాల్లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా కెప్టెన్ సర్వీసెస్, అపోలో ఫార్మశీ సంస్థ ప్రతినిధులు పాల్గొని, ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కెప్టెన్ సర్వీసెస్ సంస్థలో జూనియర్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ పూర్తి చేసిన పురుషులు, అపోలో ఫార్మశీలో రీటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసిస్ట్ పోస్టులకు పది, ఇంటర్, డిప్లొమో, ఏదేని డిగ్రీ, ఎంఫార్మ్, డీ ఫార్మ్, బీఫార్మ్ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్లలోపున్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 11వ తేదీన ఉదయం 10గంటలకు హాజరవ్వాలని, నిరుద్యోగ యువత తమ పూర్తి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91007 70978, 63694 29950 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలోని 50 మంది మహిళలు శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్ బాషా, రమేష్, మహబూబ్, ఫజల్, షరీఫ్, షబ్బీర్, పాండ పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ విద్యుత్ సర్వీసులు

- విధుల నిర్వహణలో అలసత్వం వద్దు
- శ్రీకాళహస్తి రూరల్ సబ్ డివిజన్‌లో అవకతవకలపై విచారణకు ఆదేశం
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

**తిరుపతి రూరల్:** ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలని సీఎండీ సంతోషరావు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ కార్యాలయంలో తిరుపతి రూరల్ డివిజన్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దరఖాస్తు చేసిన వెంటనే రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912, 1800 425 155333కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి రూరల్ సబ్ డివిజన్ పరిధిలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై విచారణ చేయాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీజీఎంలు గురవయ్య, ధర్మజ్ఞాని, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈలు వాసురెడ్డి, సుబ్బారావు, అమర్ బాబు పాల్గొన్నారు.

## బర్డ్‌లో నెలకు 25 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి


సర్జరీలు చేయించుకున్న పిల్లలతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఈవో, జేఈవో

**తిరుపతి తుడా:** వినికిడి లోపంతో బాధ పడుతున్న చిన్నారులకు బర్డ్ ఆస్పత్రిలో రాబోయే రోజుల్లో నెలకు 25 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ఉచితంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో శుక్రవారం కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసుకున్న పిల్లలతో చైర్మన్ మాట్లాడారు. అనంతరం ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి, ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లె రెడ్డెప్పరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వినికిడి లోపంతో బాధపడుతున్నవారికి శ్రీవారి ఆశీస్సులతో కొత్త జీవితం ప్రసాదించాలనే సదాశయంతో గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బర్డ్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని, మొదట నెలకు ఒక సర్జరీతో ప్రారంభమైన ఈ ప్రయత్నం తరువాత నెలకు మూడు దాకా చేశారని తెలిపారు. ఆ తరువాత కొద్ది కాలంలోనే నెలకు 10 సర్జరీలు చేసే స్థాయికి చేరుకుందన్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల్లో 10 మంది పిల్లలకు సర్జరీలు చేసి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించినట్టు చెప్పారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఈసీ వినయ్ కుమార్, డాక్టర్ రాంబాబు నేతృత్వంలో ఈ సర్జరీలు నిర్వహించారన్నారు. రూ.7 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఖర్చయ్యే ఈ ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టీటీడీ నిర్వహిస్తున్న శ్రవణం ప్రాజెక్టులో సుమారు 120 మంది పిల్లలు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం పేర్లు నమోదు చేసుకున్నారని, దశలవారీగా వీరందరితో పాటు ఇతరులకు కూడా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా, గత ఏడాది మేలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్మైల్ ట్రైన్ సంస్థ సహకారంతో బర్డ్‌లో ఉచితంగా గ్రహణమొర్రి సర్జరీలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఇప్పటివరకు 48 మందికి విజయవంతంగా ఈ సర్జరీలు చేశారని వెల్లడించారు.




**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.60,430 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,427 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.71,900 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.73.90 |

### ప్యాకేజీ వస్తేనే పవన్ రెండో దశ యాత్ర

– ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసులు



**తిరుమల:** పవన్ కళ్యాణ్‌కు రెండో ప్యాకేజీ వస్తేనే రెండో దశ యాత్ర చేపడతారని ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసులు విమర్శించారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ కుటుంబ సమేతంగా ఉదయస్తమాన సేవలో స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జనసేన అధినేతకు ప్యాకేజీ అయిపోయింది కాబట్టి వారాహి యాత్ర వాయిదా వేశారని పేర్కొన్నారు. రెండో దశ ప్యాకేజీ వస్తే మళ్లీ యాత్ర చేపడతారేమోనని తెలిపారు.

### జిల్లాకు 340 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు


కోదండరామిరెడ్డి

**తిరుపతి అర్బన్:** జిల్లాకు 340 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయ్యాయని డీఆర్వో కోదండరామిరెడ్డి తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అడిషనల్ సెక్రటరీ మిన్హజ్ ఆలం శుక్రవారం కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో తిరుపతి జిల్లా నుంచి డీఆర్వో కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఇప్పటి వరకు 106 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిశీలించి, బ్యాంకులతో సంప్రదించి రుణ సదుపాయం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాకు మంజూరైన 340 యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి గోరింటాకులతో విశేష అలంకరణ చేశారు. అనంతరం మహిళలు ఒకరికొకరు గోరింటాకును పెట్టుకున్నారు.




## ప్రియురాలిని పంపించేశారని!


బావిలో నుంచి వెలికి తీసిన రాజశేఖర్ మృతదేహం

**పాకాల :** ప్రియురాలిని తమ తల్లిదండ్రులతో పంపించేశారని మనస్తాపం చెందిన ఓ యువకుడు మండలంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చిగరపల్లి సమీపంలోని విశ్వనాథం బావిలో ఉన్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. విచారణలో అతను చంద్రగిరి మండలం ఐతేపల్లి పంచాయతీ నడింపల్లికి చెందిన రాజశేఖర్(24)గా తేలింది. యువకుడు ప్రేమించిన అమ్మాయిని పాకాల మండలంలోని బంధువుల ఇంటికి తీసుకొచ్చాడని, పెద్దలు ఆ అమ్మాయిని బుధవారం తిరిగి తల్లిదండ్రులతో పంపించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధురాలిపై లైంగిక దాడి


విచారణ చేపడుతున్న గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

**వాకాడు:** ఓ వృద్ధురాలు(65)పై గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి వాకాడు మండలం, రావిగుంటపాళెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. రావిగుంటపాళెం గ్రామానికి చెందిన వృద్ధ మహిళ ఇంట్లో కుమార్తె, అల్లుడులేని లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. కొంచెం అన్నం ఉంటే పెట్టండమ్మా.. అని ప్రాధేయపడ్డాడు. జాలి పడిన వృద్ధ మహిళ ఇంట్లో కూర్చోబెట్టి అన్నం పెట్టింది. ఆపై అతను తలుపునకు గడియబెట్టి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు వాకాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై శుక్రవారం గూడూరు డీఎస్పీ సూర్యనారయణరెడ్డి, వాకాడు సీఐ హరికృష్ణ, చిట్టమూరు ఎస్ఐ గోపి గ్రామంలో విచారణ చేపట్టారు. స్పెషల్ టీం ద్వారా కేసును ఛేదించి నిదితుడ్ని పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

## కీచక టీచర్ అరెస్ట్

**వెంకటగిరి:** పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి బాలికను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడు లక్ష్మీ నారాయణను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఇదే పాఠశాలలో గురువారం రెండో తరగతి చదువుతున్న బాలికను వేధించిన కేసులో ఉపాధ్యాయుడు కే వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసిన విషయం తెల్సిందే. 24 గంటలు గడవకముందే మరో వేధింపుల ఉదంతం బహిర్గతం కావడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల కథనం.. బంగారుపేట ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఏ లక్ష్మీనారాయణ ఏడో వతరగతి చదివే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రలకు తెలిపింది. బాలిక తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడుకి దేహశుద్ధి చేశారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడుపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసినట్లు ఎస్ఐనరసింహరావు తెలిపారు.

**ఉపాధ్యాయుల సస్పెన్షన్**

**వెంకటగిరి రూరల్:** పట్టణంలోని బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లక్ష్మినారాయణను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు అందినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

## 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

**భాకరాపేట :** ఎర్రావారిపాళెం మండలం ఉస్తికాయలపెంట అటవీ ప్రాంతంలోని మంగుమామిడి తోట వద్ద గురువారం రాత్రి ఎర్ర స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా దాడి చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. వారు దుంగలను పడేసి చీకట్లో పారిపోయారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో 9 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్ఐ చిరంజీవులు ఆధ్వర్యంలో సిబ్బంది ఎస్ఆర్ పాళ్యం సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టినట్లు వివరించారు. రోళ్ల మడుగు వద్ద దుంగలు తీసుకెళుతున్న వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించినట్టు చెప్పారు. దుండగులు పారిపోయారని, అక్కడ 6 దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

– 16 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

**గూడూరు:** కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేసి 16 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏ రాజేంద్ర ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఈ క్రమంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తనిఖీలు చేశామని తెలిపారు. ఒడిస్సాలోని రాయగఢ్‌కు వెళ్లి ఓ వ్యక్తి వద్ద నుంచి 16 కిలోల గంజాయిని తీసుకొస్తున్న సర్ఫరాజ్ ఖాన్, సిద్దప్ప అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ కేసులో పట్టుబడ్డ ఇద్దరు యువకులతో పాటు, కేరళకు చెందిన ఇద్దరు, రాయ్‌గఢ్‌కు చెందిన మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. కాగా, గడచిన రెండేళ్లలో 40 కేసులు నమోదు చేసి, 85 మందిని అరెస్ట్ చేయడంతోపాటు, వారి వద్ద నుంచి 495 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.